# ఊర్వశీ పురూరవ

అవును. సందేహంలేదు. నా వేపే చూస్తోంది. మళ్ళీ ఆ కళ్ళలో అదే చల్లదనం, ఆహ్వానం, ఆతృత, ఆశ –

నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడ్డాను. అయినా భయం – ఏమవుతుందోనని. మళ్ళీ ఒక్క క్షణం ... ఈసారి నే ననుకొన్నట్టే అయింది.

మళ్ళీ హఠాత్తుగా ఎవరో కన్పించారు పక్కన.

గుండె ఝల్లుమంది.

చటుక్కున పక్కకి తప్పుకొన్నాను.

భగవాన్! ఎంత విచిత్రమయింది స్త్రీ మనస్సు!

* * * * *

ఆమెని చూస్తే వెన్నెల గుర్తుకొస్తుంది. అంత తెలుపు శరీరం. వెన్నెట్లో దీపశిఖను ఎత్తిపట్టుకొన్నట్టు నుదుటిని వెలిగిస్తూ ఎఱ్ఱటిబొట్టు. ఇక ఆ కళ్ళు – భరించలేనంత ఆకలీ, ఆతృతా, జీవితమాధుర్యం ఇలాగే ఉంటుందని తెలిసినప్పటి గర్వం – ఏదో సందేశాన్నిస్తున్నట్టు అటూయిటూ కదుల్తూ భయపెడతాయి. వాటిని చూస్తూంటే కొండపల్లాల్లో జారిపడే జలపాతం విసురూ, ప్రళయం గుర్తుకొస్తుంది. కాని కన్నుల్లో వెన్నెల కురిపించి, మనస్సు భుగభుగలాడిస్తుంది. అది హృదయాల్ని కాల్చే వెన్నెల. అనుభవాలకి ఆతృత పడేట్టు చేసే వెన్నెల. తియ్యటి సుఖాలకి, మధుర క్షణాలకి తపనపరిచే వెన్నెల, ఊరించే వెన్నెల, మండించే వెన్నెల – అంత వాడి ఆ కళ్ళు.

ఆ ఇంట్లో దిగిన మూడు రోజులవరకూ ఆ కిటికీ ప్రత్యేకతని గమనించలేదు నేను.

కిటికీ అవతలంతా చీకటి. ఎప్పుడన్నా దీపం వెలిగితే ఎదురుగ్గా ఊర్వశీ పురూరవ కాలెండరూ, కిటికీ మీద అద్దం కనిపించేది.

కాని ఓ రోజు ఉదయాన్నే లేచి చూస్తే కిటికీ దగ్గర ఆ రెండు కళ్లూ కనిపించాయి – కళ్ళల్లో అదే ఆహ్వానం, ఆతృత.

కిటికీ దగ్గర నిలబడి అద్దంలోకి చూసి ముఖం దువ్వుకొంటుంది. వెనక్కి వెళ్ళి కాలెండరుకు ఆనుకుని నిలబడి తన అందాన్ని ఊర్వశితో పోల్చుకుంటున్నట్టుంది. కనురెప్పల కింద ఏదో కదలిక విచిత్రంగా కనిపిస్తుంది కాబోలు – మళ్ళీ అద్దానికి దగ్గరగా తల వుంచి కళ్ళల్లో నీడల్ని వెదుక్కొంటుంది.

నాకాశ్చర్యం వేసి అలాగే నిలబడి చూస్తే కొంతసేపటికి నన్ను గమనించి ఏం చెయ్యడానికీ తోచక దిమ్మరపోయి నిలబడి పోయింది. అప్పటి కళ్ళల్లో భయం, ముఖంలో తెలుపూ – అప్పుడే వెన్నెల గుర్తుకొచ్చింది నాకు.

నవ్వాలని, ఏదో మాట్లాడాలని నాపెదాలు ప్రయత్నం చేస్తాయి. కాని సాధ్యం కాదు.

ఏం మాట్లాడాలి?

అటూయిటూ ఎవరికోసమో వెదుక్కుంటుంది. ఎవరన్నా వస్తున్నారేమోనని భయపడుతుందిగావును. ఇల్లా నేను చూడడం తనకిష్టమేమో. లేకపోతే ఎందుకు పారిపోదు? ఇంకా సంశయంతో ఎందుకు నిలబడుతుంది?

స్త్రీలో తిరస్కారానికి అర్థం సంశయం, సంశయానికి అర్థం అంగీకారం, అంగీకారానికి అర్థం హేళనా అని నాకు తెలిసిన సైకో అనలిస్టు స్నేహితుడి సిద్ధాంతం.

ఇంకా అక్కడే నిలబడ్డది. కొంతసేపటికి నా వేపే చూడడం మానేసింది. పక్కలకే చూస్తోంది. ఆ యింట్లో చాలామంది ఉన్నారేమో! వాళ్ళు తరుచూ ఆ గదిలోకి వచ్చిపోతూంటారుగావును. లేకపోతే ఎందుకు భయం? పాపం, ఇంట్లోస్వేచ్ఛ తక్కువేమో.

కళ్ళల్లో అందాన్ని చూశాక, మాటల్లో ఆ అందాన్ని ఊహించడానికి ప్రయత్నించాను. పెదాలు ఆ కాస్తపాటి వెలుగులో సరిగ్గా కనిపించడం లేదు. ఏదైనా మాట్లాడాలను కొంటుందేమో. నాకు ఆతృత, ఉద్వేగం పెరుగుతోంది.

ఒక లిప్తలో ఆ పెదాలు కదిలించి, కళ్ళతో ఏదన్నా సందేశాన్ని అందజేస్తే తప్పిపోతుందేమోనని ప్రాణాలు బిగబట్టి – ఆ కొద్ది క్షణాల్లో నా జీవిత మాధుర్యమంతా ఇమిడి ఉన్నట్టు నిలబడిపోయాను.

అలా ఎంతసేపు? ఎన్ని యుగాలు?

ఇంకా ఆ గదిలో ఒంటరితనం మీద ఆ అమ్మాయికి నిశ్చయం కలగనట్టుంది. కళ్ళల్లో నిరుత్సాహం స్పష్టంగా తెలిసింది. మరో క్షణంలో కన్పించకుండా మాయమయింది.

ఎదురుగ్గా ఊర్వశి కోసం చేతులు జాచి, కోరికతో, తపనతో, బాధతో, నిరీక్షణా భావంతో వివసిస్తున్న పురూరవుడు.

ఇరవై అయిదేళ్ళ జీవితంలో స్త్రీ కోసం నిరీక్షణ కొత్త నాకు. ప్రేమించడంలో కాదు, ప్రేమకోసం, ప్రేమించిన వ్యక్తి కోసం ఎదురుచూడడం – ఆమె రానప్పటి నిరీక్షణా భారంలో ఏదో అందం ఉందనిపించింది నాకు.

రోజంతా ఆ కళ్ళ మీద "మ్యూజింగ్స్"తో ఖర్చయిపోయేవి.

సృష్టిలో చాలా అన్యాయం జరిగిపోయింది. మగాడికి మాట్లాడడం ఒక్కటే భావ ప్రకటనకు అవకాశంగా మిగిల్చి, స్త్రీకి కళ్ళను పదునైన ఆయుధాలుగా, ఎక్సరే, టెలివిజన్ శక్తులతో మేళవించి సిద్ధం చేశాడు భగవంతుడు. ఆ కళ్ళను సాల్వ్ చేయడం ఓ పదిరాత్రులలో నాకు సాధ్యపడింది కాదు. స్త్రీ గురించి పదిరాత్రులు ఆలోచిస్తే మగాడి మతిపోతుంది. మగాడి గురించి పదిగంటలు ఆలోచించి స్త్రీ మతి పోగొట్టుకొంటుంది.. ఆలోచనలోనూ స్త్రీదే పైచెయ్యి.

ఆమె కళ్ళను నేనర్థం చేసుకొనేలోపల నా మనస్సును ఆమె అర్థం చేసుకొన్నట్టుంది.

ఇప్పుడు ఆ కిటికీ దగ్గర కనిపిస్తే నవ్వుతుంది. నాలో ఏవో రహస్యాలు అర్థమయినట్టు కళ్ళు ఆడిస్తుంది. నేను తెల్లబోయి చూస్తే నవ్వాపుకోలేక నోటికి కొంగు అడ్డంపెట్టుకొంటుంది.

ఎంత ఆలోచించినా ఆమె ప్రవర్తనకు ఒక అర్థమంటూ కనిపించలేదు నాకు. ఏమైనా ఒక స్త్రీ తనపై శ్రద్ధను ప్రకటించడంకంటె గర్వకారణం మగాడికి మరొకటి ఉండదేమో. ఏమయినా ఆ కిటికీ దగ్గర నిలబడి అటువేపు చూడడం ఒక వ్యసనంగా పరిణమించింది నాకు.

రోజూ ఆమె అనుభవిస్తున్న భయానికి, ఆ కిటికీ చుట్టుప్రక్కలకి ఎవరన్నా వస్తారేమోనని ఆమె దిక్కులు చూడటానికి అర్థం తెలిసిపోయింది. ఒకరోజు అనుకోకుండా ఓ విచిత్రమయిన సంఘటన జరిగిపోయింది.

నేనలాగే నిలబడి ఉన్నాను. ఆమె ఎదురుగా నన్నుజాజుల్ని తలలో తురుముకొంటోంది. మధ్య మధ్య ఆ కళ్ళు కిటికీని వెదుక్కొంటూనే ఉన్నాయి. సిగచుట్టుకుంటే పెద్ద ఆరిందాలాగ, ప్రపంచాన్ని చూసిన నిండుదనం కనిపిస్తోంది ఆమెలో. అదే ఆలోచిస్తూ నిలబడ్డాను.

ఆమె యింకా పక్కలకి చూస్తూనే ఉంది. ఉన్నట్టుండి ఆమె పక్కకి తప్పుకొంది. ఏదో పనిమీద వెళ్లిందనుకొన్నాను. కాని ఎవరో వృద్ధురాలు కిటికీ దగ్గరకు వచ్చి నా వేపు చూస్తోంది. సిగ్గుతో కుంచుకపోయాను. నేనెంత తప్పు చేస్తున్నానో ఒక్క క్షణం అర్థమయింది. చటుక్కున కిటికీ తలుపులు మూసి లోపలకి వచ్చేశాను. గుండెల్లో వణుకు ప్రారంభమయింది. ఎంత పెద్దగండం తప్పిపోయింది. ఇలా ఎవరన్నా మగవాళ్లు చూస్తే బావుండదు. ఆమె భర్త

ఉన్నాడేమో! ఇందుకే కాబోలు ఆమె అక్కడ నిలబడినప్పుడల్లా భయపడుతుంది. పాపం, ఈ విషయం తెలిశాక ఆ వృద్ధురాలు ఆమెను బాధపెడుతుందేమో. ఆమె అత్తగారు గావును. ఇంతకూ ఆమె ఎవరో తెలియలేదు. ఎందుకలా నిలబడి చూస్తుంది?

ఒక విషయాన్ని గురించి పూర్తిగా తెలియకపోవడంలోనూ ఆకర్షణ ఉంది – ముఖ్యంగా స్త్రీ గురించి.

ఈసారి కాస్త జాగ్రత్తగా మెలగాలనుకొన్నాను. మర్నాడు కిటికీ దగ్గర కనిపించినప్పుడు కళ్ళల్లో జాలి కనపరచబోయాను. ఆమె నా పక్క చూడడంలేదు. అద్దంలో చూసుకొంటోంది. అంతలో తలెత్తి మళ్ళీ దించుకుని తన పనిని తాను చూసుకొంటోంది. కోపం వచ్చిందేమో నా తెలివితక్కువ పనికి. కిటికీ దగ్గర నిలబడడంలోనూ మెలకువను ప్రదర్శించాలి మరి– నాకు చాతకావడం లేదు.

ఇక నిర్ధారణకి వచ్చాను. ఆమెకు నాతో మాట్లాడాలన్న ఆసక్తి ఉంది. కాని యింట్లో మనుషులంతా ఆటంకంగా ఉన్నారు. పోనీ ఎప్పుడన్నా ఆమెతో మాట్లాడితే? బయటికి రావడానికి వీలుండదేమో. ఆమెతో మాట్లాడాలన్న ఆసక్తి రాను రాను పెరగనారంభించింది.

మరి నాలుగయిదుసార్లు యిట్లాగే జరిగింది. ఓసారి కిటికీ దగ్గర నిలబడితే చటుక్కున పక్కనుంచి మరెవరో వచ్చి నన్ను ఆశ్చర్యంగా చూడ నారంభించేవారు. వెంటనే బయటికి తప్పుకోవలసి వచ్చేది. ఆమె కిటికీదగ్గర నిలబడిన ఒంటరి క్షణాలలో దాదాపు పదిమంది నన్ను ఇలా విచిత్రంగా చూడడం, నిర్ఘాంతపోవడం జరిగినా నేనూ చాలా ఆశాభంగం చెందాను. ఆమె కూడా చాలా నిరుత్సాహపడి ఉంటుంది. ఇప్పుడిక కిటికీ దగ్గర నిలబడాలంటే భయం పట్టుకొంది నాకు. కాని ఆమె మాత్రం తరుచుగా అక్కడ కనుపించేది నాకు. భయపడుతూ, రెండు పక్కలా చూసుకొంటూ అక్కడికి వచ్చి నిలబడేది. నేను మాత్రం ఒక్కసారి గమనించి పక్కకి తప్పుకొనేవాడిని. కాని ఆ క్షణంలోనే ఎవరో కిటికీ దగ్గర ప్రత్యక్షమయేవారు. దొంగలా దొరికిపోయేవాడిని.

మరి రెండువారాల్లో శ్రీమతి పుట్టింటి నుంచి వచ్చేసింది.

బ్రహ్మచర్యాన్ని గుర్తు చేసిన రెండు నెలల తరువాత గార్హస్థ్యపు తీపి రెండు రోజులు భోజనం లేనివాడికి తేనెలాగ ఉంటుందనిపించింది. మాలతి వచ్చాక ఆ కిటికీ దగ్గర నిలబడే అవకాశం దాదాపు పోయింది. అదీగాక, ఏ విషయమన్నా మాలతి సులువుగా గ్రహించేస్తుంది. అందుకని నేనే భయపడి ఊరుకొన్నాను. కాని ఎప్పుడన్నా కిటికీ తెరిస్తే నా గురించే ఎదురు చూస్తున్నట్టు ఆ కళ్లు, ఆత్రుత, ఆహ్వానం – ఒక్కసారి ఆమెతో మాట్లాడితే బావుణ్ణన్న కోరిక మళ్ళీ మళ్ళీ కలిగేది.

ఓరోజు మాలతి ఎదురింటి ఆమె గురించి చెప్పడం ప్రారంభించింది. ఆమె పేరు కమలట. భర్త మిలటరీలో ఉన్నాడట. ఇక్కడ తల్లీ, తనూ, ఒక చెల్లెలు మాత్రం ఉన్నారట. డిసెంబరులో భర్త యింటికి తిరిగి వచ్చేస్తాడట.

"మరి ఆ యింట్లో అంతమంది కనిపిస్తారేం?" అని అడిగాను. "ఎంతమంది?" అనుమానంతో అంది.

"నాకేం తెలుసు? – ఎప్పుడూ ఎవరో వచ్చిపోతుంటారు. ఆ గదినిండా మనుషులే" అన్నాను – నాకు ఆమెతో మాట్లాడే అవకాశాన్ని వీళ్ళంతా కలగనియ్యలేదన్న ఉదాసీనతతో.

"ఏమో – వాళ్ళింట్లో ఆ ముగ్గురే ఉన్నారు. మిగతా వాళ్ళంతా చుట్టుపక్కల వాళ్ళేమో" అంది మా ఆవిడ.

మరి నెలరోజులకి ఓ వింత సంఘటన జరిగింది.

ఆ రోజు ఆదివారం. తీరిగ్గా యింట్లో కూచున్నాను. మాలతి ఎవరింటికో వెళ్ళింది. హఠాత్తుగా కమల గుర్తుకొచ్చి కిటికీ తలుపులు తెరిచాను. ఎదురుగ్గా పురూరవుడూ, ఊర్వశీ కనిపిస్తున్నారు.

జీవితంలోకి హఠాత్తుగా ప్రవేశించిన సుఖాన్ని శాశ్వతం చేసుకోవాలన్న గుంజాటన పడే పిచ్చి రాజు – అతని ఆరాటంలో ఆనందాన్ని వెదుక్కొంటూ కలలో అనుభవంలాగ చేజిక్కి జారిపోయే ఊర్వశీ – నవ్వొచ్చింది నాకు.

కాస్సేపటికి కనిపించింది కమల. జడవిప్పి అల్లుకుంటోంది. నన్ను చూసి తుళ్ళిపడినట్టు ఆగింది. కిటికీ దగ్గరకు వచ్చి నేను చూస్తున్నానా లేదా అని శ్రద్ధగా పరికిస్తోంది. అంతలో పక్కలకి చూస్తోంది. పాపం! ఎవరన్నా వస్తారన్న భయం నాలాగానే ఆమెకూ ఎక్కువేమో మరి!

ఎంతో ప్రయత్నించి ఈ రోజు సాహసం చేసి ఏదో చెప్పాలనుకున్నాను. ఏమిటి? భయపడవద్దనా? ఏమో! తెలీదు. పెదాలు కదులుతున్నాయి.

ఇంతలో – ఇంతలో – ఆమె చటుక్కున పక్కకి తప్పుకొంది. నేను జాగ్రత్తపడేలోగా ఆ గదిలో కిటికీ దగ్గర మా ఆవిడ కనిపించింది. చీకటిలోకి జాగ్రత్తగా చూస్తున్నాను. మా ఆవిడే! మొదట నన్ను నిర్ఘాంతపోయి చూసి, తెల్లబోయి, అంతలో పకాలున నవ్వడం ప్రారంభించింది.

సిగ్గుతో కుంచుకపోయి, ఏం చేయాలో తెలీక తలపట్టుకు కూర్చుండిపోయాను. రక్తం ముఖానికి పాకి ఎర్రబడింది. ఈ అఘాతాన్ని తట్టుకొనడం ఎలాగో తెలీక మనస్సులో నాకు నేనే లుమ్మతిరిగిపోయాను.

"అవేం పన్లండీ మీకు," అంటూ, నవ్వాపుకొంటూ వచ్చింది మాలతి కాస్సేపటికి. నేను మాట్లాడకుండా తేలు కుట్టిన దొంగలాగ కూర్చోవడం చూసి ఒకటే నవ్వు –

"వయస్సు వస్తున్న కొద్దీ – మరీ చిన్నవారయి పోతున్నారు మీరు" అంటోంది.

కేసు సరిగ్గా వాదించలేని ప్లీడరులాగ తయారయింది నా పరిస్థితి.

"అదికాదు మాలతీ. కిటికీ తలుపు తెరిచేసరికి నువ్వు కనిపించావు" అనబోయాను.

"చాల్లెండి. ప్రతిరోజూ మీరక్కడ నిలబడతారటగా – ఆమె అంతా చెప్పింది"

నేను దిమ్మరపోయాను. నోటినుంచి మాట రాలేదు.

ఇట్లాంటి రహస్యాలు ఆడవాళ్లు ఒకరితో ఒకరు చెప్పుకొంటారు కాబోలు. కాని నా భార్యతోనే చెప్పడం – ఈ సాహసానికి అర్థం ఎంతకీ బోధపడడంలేదు.

నిజంగా ఆమెకు నామీద ప్రేమ – ప్రేమకాదు పోనీ – కోరిక ఉందా? లేక ఆ కళ్ళ అర్థాన్ని సరిగ్గా తెలుసుకోలేక పోయానేమో!

ఆ సాయంకాలం ఆఫీసునుంచి వస్తూంటే వీధిలో నిలబడింది ఆమె. నేను చూస్తే నవ్వు తోంది. నా పిచ్చితనాన్ని, ఆతృతనీ చూసి హేళన చేస్తోందేమో. నిజంగా ప్రేమలేదేమో ననుకొన్నాను.

ఈ సంఘటన జరిగాక మరి ఆ యింట్లో ఉండాలనిపించలేదు నాకు. ఎంతో ప్రయత్నం మీద మరొక యిల్లు చూసుకుని అక్కడికి మారిపోయాను. మా ఆవిడ కిదంతా నవ్వుగా ఉంది. "ఆవిడ మిమ్మల్నేమీ చెయ్యదులెండి. ఈ ఇల్లు బాగానే ఉంది" అంటుంది, నా ముఖంలో చికాకుని కనిపెట్టి. ఏమయినా సరే అక్కడ ఉండడానికి వీలులేదన్నాను, కమలని జయించలేకపోయానన్న ఉదాసీనత ఏమో అది!

మరి రెండురోజులకి మా సెకోఅనలిస్టు మిత్రుడి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది – ఈ వూరికి బదిలీ అయినట్లు. మరి వారం రోజులకి వాడే స్వయంగా దిగాడు. వస్తూనే 'ఇల్లు కావాలంటూ' నా దగ్గరికి పరుగెత్తుకు వచ్చాడు.

పాతయింటిని అతనికి చూపాను. "ఈ యిల్లు నీకన్నివిధాలా నచ్చుతుంది భాయ్. మీ ఆవిడని తెచ్చుకొనేముందు ఓ నెలరోజులపాటు బ్రహ్మచర్యం వెలిగించు. అది నా సలహా" అన్నాను.

"ఏం కథ?"

"ఉందిలే. నీకే తెలుస్తుంది" అని మాత్రం అన్నాను.

"పదిహేను రోజుల తరువాత ఆ యింటివేపు వెళ్తే సరిగ్గా అదే కిటికీ దగ్గర నిలబడి ఉన్నాడువాడు.

"ఏం కథ" ఈసారి నేనడిగాను.

"ఉండు ఓ క్షణం" అని నన్ను పక్కకి తోశాడు. ఆమె వాడివేపు చూడడం, అంతలో ఎవరో పక్కకి రావడం, వీడిని గమనించడం, వాడు చటుక్కున తప్పుకోవడం అంతా క్షణంలో జరిగిపోయింది.

"ఏమిటి కనిపెట్టావు ఆ అమ్మాయిలో?" అనడిగాను.

కిటికీ తలుపులు మూసి వాడు మంచం మీద పడిదొర్లుతూ నవ్వాడు.

"ఏం?" అంటాను నేను.

"ఈ పదిహేను రోజుల్లో ఆ అమ్మాయి మీద చాలా థియరీ సిద్ధం చేశాను కూచో" అన్నాడు. కూచొన్నాక "మొదట యిది చెప్పు – నీకూ యిలాంటి అనుభవమే ఎదురయిందా!" అనడిగాడు.

తలుపాను. నా కథంతా చెప్పాను. చెప్పాక యింకా ఆతృత తీరక "ఆ అమ్మాయి నిన్ను ప్రేమిస్తోందంటావా?"

"ప్రేమా లేదు గీమా లేదు. నీ మొహం. ఆ అమ్మాయి ఎవరినీ ప్రేమించడం లేదు. తననే తాను ప్రేమించుకొంటోంది"

"అదేమిటి!"

"అదంతే. ఆమెలో ఒక విచిత్రమయిన 'వానిటీ' ఉంది. మనమీద ఆసక్తి కంటె, తనమీద తనకి ఆసక్తి ఎక్కువ. తను యితరుల్ని ఆకర్షిస్తోందా లేదా అన్న ఆలోచన. మనం ఆమె అందానికి ముగ్ధులవుతున్నాం అన్న ఆలోచన ఆమెకి కావాలి, మనం కాదు. సాధారణంగా ప్రతి స్త్రీలో ఉండే కోరికే యిది. కొందరికి అంతర్గతంగానే ఉండిపోతుంది. మరికొందరి కళ్ళల్లో, చేతల్లో యిది బయటపడుతుంది. కాని ఈ అమ్మాయి మరీ విచిత్రమయింది."

"ఏమిటి!"

"మనం ఆమె వేపు చూస్తున్నట్లు గమనించి తను తృప్తి పడడం చాలదు. నలుగురూ తనకి లభించిన ఈ అవకాశానికి ఈర్ష్యపడాలని కోరిక. నలుగురికీ మనల్ని చూపి తన గర్వాన్ని చాటుకోవాలి, "ఆయన నాకోసం పడి చస్తాడు. నాకు మాత్రం విసుగు. ఇందులో ఆశ్చర్యం ఏముందీ" అన్నట్టు వాళ్ళముందు ప్రవర్తిస్తుంది. అందుకని మనల్ని యిక్కడ కట్టిపడేసి నలుగుర్నీ తనే తీసుకువచ్చి చూపుతుంది."

"వాళ్ళందరినీ ఆమే తీసుకు వచ్చిందంటావా?"

"నిస్సందేహంగా – చివరికి మీ ఆవిడని కూడ."

నేను తెల్లబోతూంటే నవ్వి భుజం తట్టాడు.

"ఇదే సృష్టిలో ఉన్న విచిత్రం భాయ్. కొందరి అందం మనల్ని బుజ్జగించి జోకొడుతుంది. కొందరి అందం రెచ్చగొట్టి భయపెడుతుంది. అణుశక్తిని కొందరు శాంతియుత ప్రయోజనాలకి వాడుకొంటే, కొందరు దేశాన్ని నాశనం చెయ్యడానికి ఉపయోగించబోవడం లేదూ!"

ఈసారి లేచి రాబోతూంటే కిటికీలోంచి ఊర్వశీ పురూరవ కాలెండరు గాలికి అటూ యిటూ కదుల్తూ నన్ను వెక్కిరిస్తున్నట్టనిపించింది.

---